క్లుప్తంగా

జగనన్న పాలవెల్లువపై అవగాహన

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయం వద్ద జగనన్న పాలవెల్లువపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులకు జగనన్న పాలవెల్లువలో భాగంగా పశువుల కొనుగోలుకు ప్రభుత్వం రుణాలు అందిస్తుందన్నారు. మహిళలు, పాడి రైతులు ఆసక్తి కలిగిన వారు రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మురళీకృష్ణ, ఏపీఎం వెంకటేశ్వర రావు, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

తొక్కలపాడు(జగ్గయ్యపేట): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జీవీటీ రాజశేఖర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో చిట్టిబాబు మాట్లాడుతూ కష్టపడి పని చేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలుంటాయని తెలిపారు.

వైద్యానికే ప్రభుత్వ ప్రాధాన్యం

బలుసుపాడు(జగ్గయ్యపేట): ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీడీవో రమేష్‌బాబు అన్నారు. గ్రామంలో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వేను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 28 వరకు గ్రామాల్లో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష క్యాంపులలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి ఆరోగ్య వివరాలు సేకరిస్తారన్నారు.ఈ నెల 30 నుంచి మండలంలో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి అనిల్‌కుమార్, సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్, సీహెచ్‌వో నాగలక్ష్మి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లో గల అయ్యప్ప స్వామి వారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకి సేవా కార్యక్రమం జరిగింది.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

నందిగామ: వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ పట్టణంలోని పలు కూడళ్లలో కళాకారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్, రైతుపేట, గాంధీ సెంటర్, భారత్ టాకీస్ రోడ్, మెయిన్ బజార్, రథం సెంటర్, పాత బస్టాండ్ ప్రాంతాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చవితి ఉత్సవాల నేపథ్యంలో అప్రమత్తం

నందిగామ: చవితి ఉత్సవాల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పలు శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏసీపీ జనార్దన్ నాయుడు, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

జగ్గయ్యపేటఅర్బన్: వినాయక చవితి సందర్భంగా పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేయనున్న చవితి మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్ఐ బీవీ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలను వివరించారు.

కచ్చితమైన కొలతలు, హద్దులతో సర్వే రాళ్లు

కంచికచర్ల: కచ్చితమైన కొలతలు, హద్దులతో భూములను రీసర్వే చేసి సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ పబ్బూరి శంకర బాబు అన్నారు. మండలంలోని పేరకలపాడులో శుక్రవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆఫ్ సర్వేయర్ నండ్రు అనూష్‌కుమార్, డీటీ నాగుల్‌మీరా, మండల సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగులతో జాగ్రత్త

పెద్దమోదుగపల్లి(వత్సవాయి): పత్తిలో రసం పీల్చే పురుగులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు మోనీషా తెలిపారు. గ్రామంలో పత్తి రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తిలో గులాబీరంగు, కాయతొలుచు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలని తెలిపారు. పత్తి మొక్క కంటే అడుగు ఎత్తులో బుట్టలను పెట్టాలన్నారు. వీటిల్లో రెక్కల పురుగులను బట్టి వేపనూనెను పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్యాణం విజయలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త ఎస్.రాజశేఖర్, ఏవో వి.రవికుమార్, గ్రామ వ్యవసాయ సంచాలకులు కె.రాకేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి నూరు శాతం మెరుగైన వైద్యం

- జగనన్న ఆరోగ్య సురక్షతో సాధ్యం
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): ప్రతి ఇంటికీ నూరు శాతం మెరుగైన వైద్య సేవలందించటమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య పరీక్షలు, సీనియర్ వైద్యుల సంప్రదింపులు, ఉచితంగా మందుల పంపిణీతో పాటు ప్రతి పౌరుడు ఇంటి వద్దనే నాణ్యమైన వైద్య సేవలు పొందాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. వలంటీర్‌లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలలో ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమంపై అవగాహన కలిగిస్తారన్నారు. ఆ తరువాత ఏఎస్‌ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికీ వెళ్లి డయాగ్నోస్టిక్ హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు

ఆరోగ్య సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకోవటంతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు చేస్తారని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ, చార్కోల్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. పరీక్షల అనంతరం గ్రామాల్లో వైద్య నిపుణులు, ఆరోగ్య సిబ్బందితో సహా నలుగురు వైద్యులు శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో ఈసీజీ పరికరాలతో పాటు అదనపు పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు ఇతర చికిత్సల కోసం పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, రాజగోపాల్ రెడ్డి, వైద్యాధికారి గౌతమ్, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శుక్రవారం వైద్యాధికారి సుజనతో కలిసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 వరకు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి రోగుల వివరాలు సేకరిస్తారన్నారు. అనంతరం మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి రోగులకు పరీక్షలతో పాటు మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జగ్గయ్యపేటఅర్బన్: వచ్చే నెల 5 వ తేదీన నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి జరిగే హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక 2 వ వార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పూసాల పుల్లారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కుటుంబ వైద్యుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి గ్రామంలో ఒకరోజు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తారన్నారు. ఆ శిబిరంలో వైద్యులు వైద్య సలహాలు అందిస్తారన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కె.మధురిమ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలు, వైకల్యం, అభివృద్ధి లోపాల కేసులను సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం సహాయంతో పిల్లలను తల నుంచి కాలి వరకు స్క్రీనింగ్ చేస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం తెలియజేసిన తేదీలలో జగనన్న ఆరోగ్య సురక్ష(జాస్) శిబిరానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు పట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభం అయిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 29 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, వైద్యాధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే చికిత్సల వివరాలు వివరిస్తారన్నారు. కుటుంబంలోని ఆరోగ్య సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకొని అవసరాన్ని బట్టి అందుబాటులో ఉన్న ర్యాపిడ్ కిట్లతో ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారని, గర్భిణీ, పాలిచ్చే తల్లులను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అక్టోబర్ 5 వ తేదీన యూపీహెచ్‌సీ కొల్లా కాంప్లెక్స్ వద్ద, 10 వ తేదీన జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ వద్ద హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని తెలిపారు. సచివాలయ పరిధిలో వలంటీర్లు ఆయా ఇళ్లకు ఆరోగ్యశ్రీ బృందాలు ఏ తేదీన సందర్శిస్తారో ముందుగా ప్రతి ఇంటి వారికి తెలియజేస్తారని తెలిపారు. ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- 31 వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



పేట 31 వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక 14 వ నంబరు సచివాలయం పరిధిలో 31 వ వార్డు లోని పుట్ట బజారు, కోదాడ రోడ్డు లోని జాగృతి అపార్ట్‌మెంట్, శాంతి నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. పేదలకు మంచి చేయకుండా ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేస్తున్నా, పేదల సంక్షేమం కోసం అవేమీ లెక్కచేయకుండా మొక్కవోని ధైర్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని తెలిపారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.

అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు

వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే ఉదయభాను ప్రజలు చెపుతున్న సమస్యలను సావధానంగా వింటూ, అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజల మన్ననలందుకున్నారు.అనంతరం శాంతినగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిన్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, నాయకులు కఠారి హరిబాబు, మన్నె అప్పారావు, దరిసె వెంకటేశ్వరరావు, సయ్యద్ నూరుద్దీన్, సయ్యద్ ఆలీ, పగిడిపర్తి రాము, శ్రీను, మొక్క గురునాథం, దేవభక్తుని నాగేశ్వరరావు, గోవింద్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు లాంటి అవినీతిపరులు దేశంలోనే లేరు

మంత్రి జోగి రమేష్

నందిగామ: చంద్రబాబు వంటి అవినీతిపరులు దేశంలోనే ఎక్కడా లేరని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. ఓ కేసుకు సంబంధించి కోర్టులో విచారణలో భాగంగా శుక్రవారం జోగి రమేష్ నందిగామకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్ పటాన్ని ప్రపంచ పటంలో చూపిస్తానని చంద్రబాబు చెబితే ప్రజలు నిజంగా అభివృద్ధి చేస్తారేమో అని నమ్మారని, కానీ అవినీతిమయం చేశాడని ధ్వజమెత్తారు. బాబు వంటి అవినీతిపరుడు మరెక్కడా లేరన్నారు. బాబు చేసిన అవినీతికి తగిన శాస్తి జరిగిందన్నారు. పేద ప్రజల సొమ్మును ముఖ్యమంత్రిగా ఉండి దోచుకోవడం బాధాకరమన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు గుర్తుచేసే ఒక్క పథకం కూడా లేదన్నారు. ముఖ్యంగా ఆయన వల్ల లాభం పొందిన ఒక్క కుటుంబం కూడా రాష్ట్రంలో లేదన్నారు. ఈ రోజు రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని, దానిని ప్రజలే గర్వంగా చెబుతున్నారని పేర్కొన్నారు. ఇక జనసేన, టీడీపీ 2014 నుంచి కలిసే ఉన్నాయన్నారు. ఆ రెండు పార్టీలను 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలు ఘోరాతి ఘోరంగా ఓడించడం ఖాయమన్నారు. నారా లోకేష్ ఢిల్లీ ప్రయాణం కాళ్లు పట్టుకోవటానికేనన్నారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావుతోపాటు పలువురు పార్టీ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను

వత్సవాయి: పేద ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో వలంటీర్లు వారధులుగా పనిచేస్తున్నారని సామినేని విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను అన్నారు. శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలో పనిచేస్తున్న వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న 309 మంది వలంటీర్లను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతోనే వైఎస్సార్ సీపీలోకి వలసలు



వైఎస్సార్ సీపీలో చేరిన మక్కళ్ల వాసును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసాతోనే పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వలసలుగా వస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని 24 వ వార్డుకు చెందిన నాయకుడు మక్కళ్ల శ్రీనివాస్(వాసు) టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే ఉదయభాను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులు గుంజా హుస్సేన్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, గుంజా శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన ర్యాలీ

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి శనివారం నందిగామ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఉదయం 10.30కు పట్టణంలోని గాంధీ సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మంత్రి జోగి రమేష్‌ను సత్కరించిన న్యాయవాదులు



నందిగామ: మంత్రి జోగి రమేష్‌ను పలువురు న్యాయవాదులు సత్కరించారు. ఓ కేసుకు సంబంధించి విచారణలో భాగంగా శుక్రవారం గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ నందిగామ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులు మంత్రిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు కూడా తన నివాసంలో మంత్రిని సత్కరించారు. పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు బండి మల్లికార్జునరావు, ఈశ్వర ప్రగడ రంగారావు, పీఎల్ నరసింహారావు, మణి బాబు, సురేష్, రంగారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జుజ్జూరు గడపగడపలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగిందని, రాష్ట్రంలోని 87 శాతం మంది కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జమాలుద్దీన్, రమావత్ రాము, ఫయాజ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి

జగ్గయ్యపేటఅర్బన్: ష్టాల్లో ఉన్న పేదలను కాలయాపన చేయకుండా అత్యవసరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆదుకుంటోందని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో అన్నవరం గ్రామానికి చెందిన బాణావతు భద్రమ్మకు రూ.65 వేల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడారు పేరయ్య, బద్దూనాయక్, దువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి చనిపోయిన చిన్నారులకు ఉదయభాను అండ

నియోజకవర్గ పరిధిలోని మాగల్లు గ్రామానికి చెందిన బొజ్జగాని వెంకటేశ్వరమ్మ ఇటీవల కాలంలో ఆడబిడ్డకు జన్మనిచ్చి విజయవాడలో మృతిచెందింది. దీంతో అంతకు ముందు ఉన్న బాలుడు, ఇప్పుడు పుట్టిన చిన్నారి ఇద్దరూ తల్లి లేని వారయ్యారు. ఈ విషయాన్ని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంజూరైన చెక్కును ఉదయభాను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి భర్త చంద్రశేఖర్‌కు అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

■ మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే సీఎంలక్ష్యం

నవాబుపేట(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలను చేయటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గ్రామంలో శుక్రవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై నవాబుపేట, ముండ్లపాడు, కొణకంచి గ్రామాలకు చెందిన పాడిరైతులు, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలకు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువలో భాగంగా మహిళలు పాడి గేదెలు తీసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలన్నారు. ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడారు. రుణమేళాలో మూడు గ్రామాల నుంచి 155 మంది మహిళలు గేదెల కోసం ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నవాబుపేట, కొణకంచి సర్పంచ్‌లు గొర్రెముచ్చు మేరీ, గోనెల దేవి, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు.

■ 99 మందికి నూతన పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నూతనంగా మంజూరైన 99 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఉప సర్పంచ్ బాడిశ పాపారావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అనిగండ్లపాడు సచివాలయంలో నూతనంగా మంజూరైన 65 పింఛన్లను సర్పంచ్ బి. జ్యోతిబ్రహ్మం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపల్లి పెంటయ్య, దోసపాటి దానయ్య పాల్గొన్నారు.

■ తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

నవాబుపేట(పెనుగంచిప్రోలు): తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

■ వివిధ కళాశాలల్లో ఇంజనీర్స్ డే వేడుకలు

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో, మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్‌డే వేడుకలు జరిగాయి. మిక్ కళాశాలలో విద్యార్థులకు లేటెస్ట్ టెక్నాలజీతో ఆరు రకాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలలోవివిధ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ జగనన్న పాల వెల్లువతో మహిళల పురోభివృద్ధి

కంచికచర్ల: జగనన్న పాల వెల్లువతో మహిళల ఆర్థిక పురోభివృద్ధి జరుగుతోందని పశుసంవర్ధకశాఖ ఏడీఏ వెంకట్రావు అన్నారు. కంచికచర్ల గ్రామ సచివాలయం-2 వద్ద శుక్రవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు, వెలుగు ఆధ్వర్యంలో గేదెలు కొనుగోలుకు రుణాలు ఇస్తారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణామృతం అందిస్తారన్నారు. పశుగ్రాసాన్ని ముక్కలు చేసే చాఫ్‌కట్టర్‌ను ప్రభుత్వం 40శాతం రాయితీతో పంపిణీ చేస్తుందన్నారు. మండలంలోని 24మంది లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.24 లక్షల విలువగల పాడి గేదెలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు కొండూరు విజయ విశ్వనాథ్, ఎం.నగేష్‌కుమార్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్, పశు సంవర్ధక సిబ్బంది, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

■ డ్వాక్రా మహిళలకు జగనన్న పాలవెల్లువ

మక్కపేట(వత్సవాయి): డ్వాక్రా మహిళలకు జగనన్న పాలవెల్లువ ద్వారా రుణాలను అందిస్తామని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కె.రమేష్ తెలిపారు. మక్కపేట, గోపినేనిపాలెం, మంగొల్లు, దేచుపాలెం, భీమవరం గ్రామాలలోని డ్వాక్రా మహిళలకు శుక్రవారం జగనన్న పాలవెల్లువపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలవెల్లువ పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు గేదెల రుణాల కోసం కనిష్టంగా రూ.30 వేల నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు రుణాలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుడేటి శారమ్మ, బాణావతు శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, పశు వైద్యాధికారి కె.శ్రీనునాయక్ పాల్గొన్నారు.

■ అంగన్‌వాడీ భవనాలను త్వరగా పూర్తిచేయాలి

పెండ్యాల(కంచికచర్ల): ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణపనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో నాడు నేడు పథకంలో భాగంగా ఫేజ్-2లో మంజూరయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆచప పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 12 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ చాన్ బహదూర్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

■ సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2 లక్షల చెక్ అందజేత

నందిగామ: అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని దాములూరు గ్రామానికి చెందిన గడిపూడి వెంకట్రావు దంపతుల కుమార్తె వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును శుక్రవారం రవి శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు.

■ చిన్నపిల్లలతో ఫ్రెండ్లీగా ఉండాలి ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి

కంచికచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు పీడీ మాట్లాడుతూ స్నేహబాలల గ్రామాలుగా చేయాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించాలని, బాల కార్మికులు లేకుండా చూడాలని, వారిని బడికి పంపాలన్నారు.బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, డీసీపీఓ జాన్సన్, ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ, ఎంఈఓ బి.బాలాజీ, కంచికచర్ల, చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓలు వి.భాగ్యరేణుక, లక్ష్మీ భార్గవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

■ పాడి రైతు సంక్షేమమే ధ్యేయం

ఆత్కూరుపాడు(వత్సవాయి): పాడిరైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యమని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శుక్రవారం చిల్లకల్లు క్లస్టర్ పరిధిలో ఆత్కూరుపాడు, వేమవరం పాలకేంద్రాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షా 30 వేల రూపాయలతో ఆధునీకరణ చేసిన భవనాన్ని ప్రారంభించారు. పాలకేంద్రం అధ్యక్షుడు అనంత శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.